# దుమ్మల గొండి

సన్యాసిరాజు నందరూ 'దుమ్మల గొండి' అంటారు. పెద్దవాళ్లు కొందరు ముఖం మీదనే అంటారు.

సన్యాసిరాజు అయిదేళ్ళపాటు సమితి ప్రెసిడెంట్‌గా పనిచేశాడు. రెండోసారి ఎన్నికల్లో చంద్రంపేట నాయుడి చేతిలో కాస్తలో ఓడిపోయాడు. అతను స్వాతంత్ర్యసమర యోధుడు! ఎప్పుడో మూడ్రోలు మరుభూన్నం తెల్లోళ్ళు జైల్లో పెట్టారని– అతన్నొక దేశభక్తుడిగా తలచి అయిదెకరాల పొలం, నెలకి రెండువందల రూపాయల పింఛనీ కూడా ఏర్పాటు చేశారు.

ఇంతకీ అతన్ని దుమ్ములగొండి అని ఎందుకంటారో చెప్పనే లేదు. అతను ఎవరిమీదనన్నా కన్నువేశాడో, వాళ్ళపని పట్టేదన్నమాటే. ఆయన లోగడ ఎవరెవర్ని 'దిబ్బజేయిాశాడో' మన కయితే తెలీదుగాని, రామరామ ఆచార్లుగార్ని మాత్రం కచ్చితంగా 'దిబ్బే' జేసేశాడు. అతను నవ్వితే అచ్చం దుమ్మలగొండి నవ్వినట్టుంది (ట).

వంకాయలపాడు నియోజక వర్గానికి పదేళ్లుగా ఆచార్లుగారు తిరుగులేని ఎమ్మెల్యే. మొదట్లో చాలా నిజాయితీగా వుండేవాడు. ప్రజలకి అతనంటే మాంచి గురిగావుండేది. రెండో సారి కూడా నెగ్గేసరికి గడ్డితినమరిగేడు. క్రమంగా బొత్తిగా బరితెగించిపోయాడు. అతని మేడ గోడల్లోనే అరలుంటాయట. అతని దగ్గిర బంగారం బిస్కట్లూ. కోయంబత్తూరు సరుకూ వుంటుందట. మూడోసారి అతనికి పేట వీరాపాత్రుడు పోటీగా నిలబడ్డాడు. ఇంతాజేస్తే వీరా పాత్రుడు పేట పంచాయితీలో మెంబరు. దాంతో వంకాయలపాడు నియోజక వర్గానికి నిలబడేవాళ్ళు అరడజను మంది.

మరి ఎలా జేరాడో ఇద్దరి మధ్యకీ జేరాడు. దుమ్మలగొండి సన్యాసిరాజు. ఆచార్లుకి రాజుమాటలు వినేసరికి ఈసారి తను ఎమ్మెల్యే కావడం కష్టంలాగే కన పడింది. కాకిచేత కబురుపెడితే చేతులు కట్టుకు వచ్చేవాడల్లా ఇంతవా డెలా అయ్యాడా వీరాపాత్రూడూ అనిపించింది ఆచార్లుగారికి.

"కావాలంటే ఓ యాభై వేలు పారేద్దాం. అడ్డు తప్పుకుంటాడేమో కనుక్కో" అన్నాడు ఆచార్లుగారు.

"ఎంతా? యాభైవేలా?" అని ఒక్క నవ్వు నవ్వేడు దుమ్మలగొండి. అచ్చం దుమ్మలగొండి లాగే నవ్వేడు. ఆ నవ్వు చూసేసరికి ఆచార్లుగారికి భయం వేసింది.

"వీరా పాత్రుడంటే మీరేమో అనుకుంటున్నట్టుంది. ఖచ్చితంగా పదిలక్షలూ పట్టుకుని ముగ్గులోకి దిగాడు. అతని పక్షాన పెద్దవాళ్ళే కలగజేసుకుంటున్నారు" అన్నాడు రాజు.

'గడ్డి తినడం' అలవాటయిపోయి అందరితోనూ తనెలా చెడ్డ తెచ్చుకున్నదీ జ్ఞాపకం వచ్చేసరికి ఆచార్లుగారికి చాలా చాలా పశ్చాత్తాపం కలిగింది.

"సరే. మరెంతంటావ్. మరో పదివేలు. అరవయి వేలిస్తాను" అన్నాడు ఆచార్లుగారు.

"ఒక లకారం యివ్వతలుచుకుంటే చెప్పండి. అప్పుడు పన్ను చక్కబెడతాను, లేదా ఈ సారికి పాత్రుడు నెగ్గడం ఖాయం" అన్నాడు రాజు. అంటూ సరాసరి లేచి వెళ్ళిపోయాడు.

"దుమ్మలగొండి వెధవ" అనుకున్నాడు ఆచార్లుగారు.

ఎలక్షన్లు దగ్గిర పడుతున్నాయి. వీరా పాత్రుడు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాడు. ఈ

ఆర్భాటం అంతా చూసేసరికి ఆచార్లుగారికి కరచరణాలు ఆడటం లేదు.

వెంటనే రాజుకి ఫోన్‌చేశాడు. మనసులో తిట్టుకుంటూనే. లక్షా యిచ్చేసి పాత్రుణ్ణి అడ్డు తొలగించుకోవాలి అని నిర్ణయానికొచ్చాడు. ఓసారి యిటు వచ్చి వెళ్ళమన్నాడు రాజుని, ఫోన్‌లో. సాయంత్రం అయినా రాజు రాలేదు. చూస్తూ చూస్తూ వుండగానే గాలివాలు మారిపోయింది. జిల్లాలోవున్న మంత్రు లిద్దరికీ హోరాహోరి యుద్ధం ప్రారంభం అయిపోయింది. ఒకరి రంకులొకళ్ళు బయటపెట్టుకుంటూ కరపత్రాలువేయిస్తూ వీధినపడ్డారు. కాంగ్రెసు అధిష్టానవర్గం యిద్దర్నీ పార్టీ లోంచి 'సస్పెండు' చేసింది. ఆ ముక్క రేడియోలో వినేసరికి ఆచార్లుగారి మనసు పరిపరివిధాల పోయింది. రెండు మూడు రోజులయ్యేసరికి తన చెవులు తనే నమ్మ లేకపోయాడు. ఈసారి వీరాపాత్రుడు ఎలక్షన్‌లో నెగ్గడం, మంత్రి కావడం తప్పదంటే తప్పదన్నట్టుంది వాతావరణం చూడగా.

మళ్ళీఫోన్ చేశాడు ఆచార్లుగారు దుమ్మలగొండి రాజుకి. మనిషి పలకలేదు. ఇక మానాభిమానాలు చంపుకుని రాజు యింటికి తానే వెళ్ళాడు.

"ఏమండోయ్ ఆచార్లుగారు ఇలా దయచేశారు" అన్నాడు రాజు నవ్వుతూను. ఆ నవ్వు అచ్చు దుమ్మలగొండి నవ్వులాగే వుంది. ఆ నవ్వు చూసేసరికి ఒక్కక్షణం భయం వేసింది. రాజు పాత కావేషాలు మనసులో పెట్టుకొని ఓ సాధిస్తున్నాడని తేలిగ్గా బోధపడిపోయింది. వ్యవహారం రెండు లక్షలకి ఫైసలా అయ్యేసరికి బ్రహ్మపెళ్ళ్యం అయ్యింది. ఆచార్లుగారు నమ్మకమయిన మనిషిచేత సాయంత్రం రెండు లక్షలూ పంపించాడు. దొంగనోట్లు కావు. అసలు సిసలు నోట్లే. ఆచార్లుగారికి ప్రాణం ఉసూరుమన్నది.

మొత్తానికి రాజు ఏం చేశాడో, ఎక్కడ ఏ మందు వేశాడో, అంత పెద్ద ప్రచారం చేసిన వీరాపాత్రుడు ఠక్కున 'విత్ డ్రా' అయిపోయాడు. దుమ్మలగొండిరాజు ఆచార్ల గారిపక్క ప్రచారం ప్రారంభించాడు. జీపుమీద వంకాయలపాడు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకూ యిద్దరూ కలిసే తిరుగుతున్నారు. ఆ ఖర్చూ యీ ఖర్చూ పేరు చెప్పి మరో పాతికవేలు లాగేడు రాజు. వెధవసొమ్ము పోతేపోయింది. ఆచార్లుగారికి మహాధైర్యంగా వుంది. ఈసారి తాను మంత్రినయితే బంగారునగలు చేయిస్తానని ఊళ్ళోని కేశవస్వామికి మొక్కుకున్నాడు తిరుపతి దేవుడికూడా హుండీలో వెయిన్నూట పదహార్లు వేస్తానని మొక్కుకున్నాడు.

రెండ్రోజుల్లో పోలింగ్ ప్రారంభం అవుతుందనగా–

"రాజూ– మనం గెలవడం ఖాయమే నంటావా" అన్నాడు ఆచార్లుగారు.

"మీరు గెలవకపోతే మరెవరు గెలుస్తారు" అన్నాడు సాగదీస్తూను రాజు. అలా సాగదీసి ఒక్క నవ్వు నవ్వాడు. అచ్చం దుమ్మలగొండిలా నవ్వేడు. ఆచార్ల గారికి ఎందుకో భయం వేసింది.

వీరా పాత్రుడు గెలవలేదు. ఆచార్లు గారూ గెలవలేదు. ఎవరో సంతలో చింతకాయ బుచ్చినాయుడు గెలిచాడు. అంతా ముక్కుమీద వేలు వేసుకున్నవాళ్ళే.

ఆచార్లుగారికి అయిదులక్షలు ఖర్చయ్యాయి.

దుమ్ములగొండి రాజు ఒక లక్ష పారేసి వీరా పాత్రుణ్ని ఉపసంహరింప చేశాడు. అయితే యిందుకు రాజు చాలా పాట్లుపడవలసి వచ్చింది. అన్ని పక్కలనించీ వొత్తిడి తీసుకువస్తేగాని వీలయ్యింది గాదు. ఇందువల్ల రాజుకి నికరాదాయం– ఎన్ని కల ప్రచారంలో మిగిలిన సొమ్ముతో కలుపుకుని– లక్షా పాతికవేలు.

ఆచార్లుగారికి డిపాజిట్టు దక్కింది. నెల్లాళ్ళయి ఆయన వీధిలోకి రావడం ఎవ్వరూ చూడలేదు. దుమ్మలగొండివల్ల తాను సర్వనాశనం అయిపోయాడు.

ఇంతకీ దుమ్మలగొండి ఇంత పని ఎందుకు చేశాడూ?– దానికో కథ వుంది.

తన కొడుక్కి ఒక కంపెనీలో ఉద్యోగంకోసం దుమ్మలగొండి రాజు ఆచార్లు గార్ని సహాయం అడిగాడు. ఆ కంపెనీ వాళ్ల కొత్తవాళ్ళని వేసుకునే- సెలక్షన్ కమిటీలో ఆచార్లుగా రున్నారు. రాజు పని చెయ్యనన్లేదుగాని. అలాగే నన్నారు. దొడ్డి దారిన దుమ్మలగొండి రాజు రెండు వేల రొక్కం పంపక పోలేదు. మరో అయిదు వందలు ఎక్కువ యిచ్చాడని- రాజు శత్రువయిన మిలట్రీ అప్పారావు అల్లుడికావుద్యోగం వేయించాడు. రాజు తల కొట్టేసినంత పనయింది. అంతేనా- అంతే అయితే బాగానే వుణ్ణు. రెండోసారి సమితి ప్రెసిడెంట్‌గా పోటీ చేసినప్పుడు ఆచార్లు చంద్రంపేట నాయిణ్ణి బలపరిచాడు. అది మరీ శూలంగా గుచ్చుకుంది దుమ్మలగొండికి. సరేసరి యిన్నాళ్ళూ కడుపులో పెట్టుకున్నాడు. ఇప్పుడదునొచ్చింది. దెబ్బతీశాడు.

ఆచార్లుగారు దుమ్మలగొండి వాసనచూసిన మెకంలా అయిపోయాడు. నవనాడులూ కుంగిపోయాయి. గోరుచుట్టుమీద రోకటి పోటులాగ- ఆచార్లుగారి దగ్గిర బంగారం బిస్కట్లూ, కోయంబత్తూరు సరుకూ దొరికినందుకు అరెస్టు చేశారు. బెయిలుమీద విడిపించుకునే సరికి నానా గడ్డీ గరవవలసి వచ్చింది. అక్కడికి పెట్టడుగున తుక్కులానలిగిపోయిన రెండు వందల రూపాయలనోట్లూ, అరిగిపోయిన మూడో నాలుగో రాణీ వెండి రూపాయలూ మిగిలాయి ఆచార్లుగారి దగ్గిర. అంతకు మించి చిల్లిగవ్వలేదు.

ఉన్న సొమ్మంతా ఖర్చయిపోయింది. పోలీసులొచ్చి దొంగ బంగారం, దొంగ నోట్లతోపాటు- పెళ్లాం పుట్టింది నగలూ కూడా వొలుచుకు పోయారు. జైలులోంచయితే విడిపించుకున్నాడుగాని కేసు రిజిష్టరయి పోయింది. ఉరిపోసుకు చావడంతప్పమరి గత్యంతరంలేదు.

దుమ్మలగొండి మనిషి నవ్వినట్టే నవ్వుతుందట. (లేకకొందరు మనుషులు దుమ్మలగొండిలా నవ్వుతారు) అది వాసనచూస్తే ఎముకలన్నీ మెత్తపడి పోతాయట. ఆ మెకం మరి లేవలేదు. దుమ్మలగొండి అంత ప్రమాదమయిందట. ఆచార్లుగారు దుమ్మలగొండి నెప్పుడూ చూళ్ళేదు! కాని మనుషుల్లో కూడా దుమ్మలగొండి లుంటారని కనుక్కో బోయేసరికి- అంతా పూర్తయిపోయింది.

*రచనాకాలం : 2-12-1975*
*ప్రచురణ : అనామిక, సెప్టెంబర్ 1976*
***'విశాఖ సాహితి' కథలపోటీలో బహుమతి పొందినది.***